క్లుప్తంగా

శ్రీవారికి పూలంగి సేవ

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరాలయం వీధిలోని శ్రీమద్ వెంకట రామమూర్తుల వారి ఆలయంలో పెరటాసి నెల(తమిళనెల) మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి పూలంగిసేవ నిర్వహించారు. మొదటి శనివారం సందర్భంగా పట్టణంలోని భక్తులంతా ఉదయం నుంచే బారులుతీరి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ అనంతదీక్షితులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

వాహనాలు తనిఖీ

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో పెన్నేపల్లి గ్రామ సమీపాన శనివారం నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు వాహనాలు తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు, రికార్డులు లేని వాహనాలపై చలానా కట్టించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడంతో తేలికపాటి ప్రమాదాలకు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతుండడంతో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెచ్చరించిన వేగంలోనే వెళ్లాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో ఎదుటి వారికి కూడా ప్రమాదమేనన్నారు. ముఖ్యంగా పరిశ్రమలకు వెళ్లే కార్మికులు అతివేగంగా బైక్‌లలో వెళ్లడంతో తరచూ ప్రమాదాల బారినపడుతున్నట్లు చెప్పారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

సైదాపురం: మండలంలో ముమ్మరంగా ఉపాధి పనులు చేపట్టినట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండలంలోని సైదాపురం, దాడిశెట్టిపల్లి గ్రామాల్లో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారంలో ఒక్క రోజు ఉపాధి కూలీలకు పథకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏపీఓ చంద్రయ్య ఉన్నారు.

మానమాలలో గ్రామసభ


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి: మండలంలోని మానమాల గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందులోభాగంగా శనివారం గ్రామసభను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, మహిళ అధ్యక్షురాలు కూచివాడ పవిత్రారెడ్డి, సీనియర్ నాయకులు డి.చంద్రశేఖర్‌రెడ్డి, చేని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు సహకారం

చిల్లకూరు: తీర ప్రాంత గ్రామాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని అదానీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ రాజేష్ రంజన్ తెలిపారు. గుమ్మళ్లదిబ్బగ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పన అనే అంశాలపై అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రతినిధులు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం తీర ప్రాంతంలోని గ్రామాల్లో విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తుందన్నారు. ఇందులో భాగంగానే చిల్లకూరు మండలంలోని పలు గ్రామాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. అదానీ ఫౌండేషన్ ద్వారా తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం దేవసేన, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మత్స్యకార కాపులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతర నిర్వహించే ప్రధాన ప్రదేశాలలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న దుకాణాలను శనివారం తొలగించారు. వెంకటగిరి సీఐ ఏవీరమణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్ సంయుక్తంగా దాడులు నిర్వహించి రోడ్డు మార్జిన్ ముందుకు వచ్చిన దుకాణాల ప్రచార బోర్డులు, వ్యర్థాలను తొలగింపజేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారి నగరోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క భక్తుడికి దర్శన భాగ్యం కల్పించాలని ఈ మేరకు దుకాణదారులు సహకరించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలో పలు చోట్లు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ జయచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26వ తేదీల్లో వెంకటగిరిలో నిర్వహించబోతున్న పోలేరమ్మ జాతర నిర్వహణ కోసం మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలిపారు. పట్టణంలోని శివాలయంవీధి, కాశిపేట, జ్యోతిమహల్, భ్రమరాంబ సెంటర్, కాలేజీమిట్ట, మందరిళ్లు, మనులాలాపేట, ఘోషాసుపత్రి, మల్లమ్మగుడి ప్రాంతం, రాణిపేట, తహశీల్దార్ కార్యాలయం సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఏర్పడనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సూపర్ సిక్స్ ఎక్కడ బాబూ..

● వంద రోజుల కూటమి పాలనలో వైఫల్యాలు అనేకం

సూళ్లూరుపేట: అధికారం కావాలంటే ఏమైనా చెప్పాలి... అధికారం వచ్చాక ఇచ్చిన హామీలను ఎగ్గొటేందుకు సాకులు వెతుక్కోవాలి ఇదీ కూటమి నాయకుల తీరు. ప్రజలకు సూపర్ సిక్స్ కింద ఇచ్చిన హామీలను ఏవిధంగా ఎగ్గొట్టాలో రకరకాల కారణాలను వెతుకుతున్నారు. 2014 ఎన్నికల సమయంలో కూడా రుణమాఫీ, పొదుపు సంఘాల రుణమాఫీతోపాటు 630 హామీలిచ్చి గెలిచిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించగానే వాటిని గాలికి వదిలేశారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో జనంలోకి వచ్చి గెలిచీ గెలవగానే నవరత్నాలను నూటికి 99 శాతం నెరవేర్చారు. మళ్లీ మూడు పార్టీల కలయితో వున్న కూటమిలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే సూపర్ సిక్స్ పథకాలను తుంగలో తొక్కారు. సూపర్‌సిక్స్ పథకాలకు ఒక్క సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి రూ.987.53 కోట్లు అవసరమవుతుంది. అయితే ఇన్ని నిధులు కేటాయించి సూపర్‌సిక్స్ పథకాలను కొనసాగిస్తారా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్లు ఇవ్వాల్సిందే..



కూటమి ప్రభుత్వం అధికారంతోకి వస్తే ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచిత పథకం అమలు చేయాల్సిందే. దీనిపై మహిళలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. పాలనలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీ పట్టించుకోకపోతే ఎలా. ఇప్పటికే పాలన మొదలై వంద రోజులు అవుతున్నా దీనిపై ప్రస్తావనే లేదు. ఎన్నికల ముందు ఒకలా ఎన్నికల తర్వాత మరోలా మాటమార్చడం సరైంది కాదు. వంద రోజులు గడుస్తున్నా ఇంత వరకు సిలిండర్లు అందలేదు.

– ఎస్.గౌరి, సూళ్లూరుపేట

పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారు



వర్షాలు కురుస్తున్నాయి. ఎల్లి వరి పంట సాగు చేయాలి. గతంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అయితే ఈ పాటికి మాకు రైతుభరోసా ఇచ్చేసి ఉంటారు. ప్రతి ఏడాది చెప్పిన సమయానికి పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. ఇంత వరకు పట్టించుకోలేదు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్నా రైతులను పట్టించుకోలేదు.అన్నదాత సుఖీభవగా పేరు మార్పు చేశారే కానీ రైతులకు నగదు మంజూరు చేయలేదు.

– కాకాణి రవి, రైతు, బత్తలాపురం, ఓజిలి మండలం

హామీలు నెరవేర్చాలి



అప్పట్లో పొదుపు మహిళల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలో వచ్చిన తరువాత ఆ మాట మరిచి పోయారు. తాజాగా బాబుతో పాటు కూటమి నేతలు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఇస్తామన్న ఆర్టీసీ ప్రయాణాన్ని త్వరలో కల్పించాలి. వంద రోజులు గడిచిపోయింది కదా ఎప్పటి నుంచి కల్పిస్తారో చెప్పాలి. ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి. ఓట్లు వేశాం కాబట్టి ఇచ్చిన హామీలను గట్టిగా అడుగుతున్నాం. తెలంగాణలో చూడండి వెంటనే కల్పించారు. మీరు కూడా అదే విధంగా ఆర్టీసీ ప్రయాణాన్ని మహిళలకు ఉచితంగా కల్పించండి.

– ఎం భారతమ్మ, శ్రీధనమల్లి గ్రామం

యువతను మోసం చేయవద్దు

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తానని, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. 2014లో మాదిరిగా నిరుద్యోగులను మోసం చేయకుండా ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలి. ఈ హామీలను నెరవేర్చకుండా కాలాన్ని సాగదీస్తూ ఇబ్బందులకు గురి చేస్తే యువత ఆగ్రహాన్ని కూడా ఈ ప్రభుత్వం చూడాల్సి వస్తుంది.

– కె.ఆదినారాయణరెడ్డి, నాయుడుపేట

తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారు?



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం పథకం కింద ఒక్కో బిడ్డకు రూ.15వేలు చొప్పున ఇద్దరు, ముగ్గురు, నలుగురు ఇంట్లో ఎంత మంది బిడ్డలు ఉన్నా అందరికీ ప్రతి ఏటా నగదు జమ చేస్తామన్నారు. బడులు పెట్టి మూడు మాసాలు పూర్తి అవుతోంది. కూటమి ప్రభుత్వ ఏర్పడి వంద రోజులైంది. కానీ తల్లికి వందనంపై చంద్రబాబు పట్టించుకోవడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూ.30 వేలు రావాలి. ఇప్పటి వరకు ఎప్పుడు వేస్తారో చెప్పలేకపోతున్నారు.

– పిల్లా శైలజ, పెళ్లకూరు

చేయూత సొమ్ము కోసం ఎదురుచూపులు



గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలకు ఏడాదికి 18,750 రూపాయలు ఇచ్చేవారు. ఈ పథకానికి పేరు, రంగులు మార్చి ఏడాదికి ఒక్కసారి ఇచ్చే సొమ్మును నెలకు రూ.1500గా చేసి, తర్వాత 750 తగ్గించి ఇచ్చేలా మార్చి ఊసర వెల్లి స్కీమ్‌ను రూపొందించారు. వందరోజులు గడిచినా ఈ పథకాన్ని ఇస్తారా, ఎగ్గొడతారా అనే విషయం అర్థం కావడం లేదు. ఏ విషయాన్నైనా స్పష్టంగా చెబితే దానిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేదలకు కాస్త ధైర్యం ఉంటుంది.

– పి.అమరావతి, తడ

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక

చిల్లకూరు: రాష్ట్ర స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ అండర్–19 విభాగంలో క్రీడాకారులను చిల్లకూరు గురుకుల కళాశాలలో శనివారం ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో జరిగిన హ్యాండ్‌బాల్, చెస్, బాల్ బాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్ పోటీలలో జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి క్రీడాకారులు 200 మంది వరకు పాల్గొన్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డి.సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

చిల్లకూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం రెండో రోజు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని కోటలో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు పంపిస్తామని ఎంఈఓ సనత్‌కుమార్ తెలిపారు.

విషగుళికలు మింగి వివాహిత ఆత్మహత్య

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బేరిపేటకు చెందిన రాయపాటి వెంకట లక్ష్మి(40) అనే వివాహిత మానసిక స్థితి సరిలేకపోవడంతో ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బేరిపేటకు చెందిన రాయపాటి శ్రీనివాసులు పట్టణంలోని బీఎంఆర్ నగర్ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య వెంకటలక్ష్మీ ఇద్దరు కుమారుడు ఉన్నారు. వెంకటలక్ష్మికి కొద్ది నెలలుగా మానసిక స్థితి సరిగా లేక వైద్యశాలలో చికిత్స పొందుతోంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకలను చంపేందుకు తెచ్చి ఉన్న విషగుళికలను మింగేసి ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చి గమనించిన భర్త ఆమెను వైద్యశాలకు తరలించాడు. చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ వల్లపు శ్రీహరిబాబు కేసు నమోదు చేశారు. వెంకటలక్ష్మి మృతదేహానికి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం జరిపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సముద్ర తీరాన్ని శుభ్రంగా ఉంచాలి

వాకాడు: సముద్ర జలాల్లో వ్యర్థాలు కలవకుండా ఆయా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ అన్నారు. వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో శనివారం ఆయన స్వచ్ఛసాగర్–సురక్షిత సాగర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్ కాయిస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొని. తీరంలో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు వాటం గారి వెంకటరమణయ్య, ఇన్ కాయిస్ సంస్థ సైంటిస్ట్ శ్రీనివాసరావు, నాగోజీరావు, పర్యావరణ పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, కిరణ్‌రెడ్డి, మహీంద్ర, కాపులు ఆర్కేటి మహేంద్ర, గోవిందయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

చిట్టమూరు(చిల్లకూరు): మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా సాగింది. ఈ నెల 13వ తేదీన ఆరంభమైన బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణం చేపట్టారు. శుక్రవారం రాత్రి ఈశ్వరుడు, దేవేంద్రుల మధ్య కళ్యాణ రాయబారాన్ని ఆలయ అర్చకులు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ క్రమంలోనే కల్యాణ మహోత్సవాన్ని ఆలయంలోని మండపంలో జరిపించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం తరువాత అక్షింతల కోసం యువతీ యువకులు పోటీ పడ్డారు.


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు


భారీ ఎత్తున అన్నదానం

కల్యాణోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన దువ్వూరు హనుమంతురామిరెడ్డి, ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం ఈ ఏడాది 8 వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి దువ్వూరు శేషురెడ్డి, రామరాఘవరెడ్డి, రామలింగారెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

మూడు టిప్పర్లు పట్టివేత

చిల్లకూరు: అక్రమంగా క్వార్ట్జ్ తరలిస్తున్నప మూడు టిప్పర్లను గనుల శాఖా అధికారులు పట్టుకుని శనివారం పోలీసులకు అప్పగించారు. ఇటీవల కాలంలో అక్రమంగా మైనింగ్ చేపడుతున్న వారిపై దృష్టి పెట్టిన గనులశాఖ సైదాపురం ప్రాంతం నుంచి చెన్నై వైపు ఎలాంటి అనుమతులు లేకుండా వెళుతున్న మూడు టిప్పర్లను పట్టుకుంది.

వేడుకగా శ్రీవారి ఊంజల్ సేవ


స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల ఊంజల్‌సేవ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, అభిషేకం, పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల కళ్యాణం, సాయంత్రం 5 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలను తిరుచ్చిపై కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్ఛారణ, మేళతాళాలతో ఊరేగిస్తూ సహస్ర దీపాలంకరణ మండపం వద్దకు వేంచేపు చేశారు. అనంతరం ఊంజల్‌సేవ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు గాయాలు

చిల్లకూరు: మండలంలోని కడివేడు గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గూడూరు పట్టణంలోని ధూర్జటినగర్‌కు చెందిన మణి, సుజాత బైక్‌పై చిట్టమూరు మండలం కొత్తగుంటకు వెళ్లి తిరిగి గూడూరుకు బయల్దేరారు. ఈ క్రమంలో కడివేడు సమీపంలోకి వచ్చే సరికి బైక్ అదుపు తప్ప పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి 108కి సమాచారం అందించారు. గాయపడిన ఇద్దరినీ గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆలయ భూముల వేలం

చిల్లకూరు: కలవకొండ గ్రామంలోనిశ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన మెట్ట భూముల లీజు కోసం శనివారం ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయానికి చెందిన ఒక బిట్ 25 ఎకరాలకి సంవత్సర కాల పరిమితితో రూ.1.71 లక్షలకు పాడుకున్నారని తెలిపారు. రెండో బిట్ 16.34 ఎకరాల భూమిని రూ.1.12 లక్షలు, మూడో బిట్ 21 ఎకరాలు రూ.1.50 లక్షలు, నాలుగో బిట్ 21.68 ఎకరాలు రూ.1.40 లక్షలకు పాడుకున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం


విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టమూరు(చిల్లకూరు): ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయపడిన బాధిత విద్యార్థినికి మెట్టు పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఆర్థిక సాయం అందించారు. వారం రోజుల క్రితం మెట్టు నుంచి 14 మందితో జాంగ్ర పేటకు బయల్దేరిన ఆటో మలుపు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థిని మాధవిలతకు చేయి విరిగింది. దీంతో ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి తిరిగివచ్చింది. ఎంఈవో సూచనలతో మెట్టు పాఠశాల ఉపాధ్యాయులు రూ.18 వేలు నగదును అందించారు.

మత్స్యకారుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

చిల్లకూరు: తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో క్రిస్‌సిటీ కోసం సేకరించే భూముల సాగు వివరాలను సర్వే బృందాలు తారుమారు చేస్తున్నాయని ఆరోపిస్తూ మత్స్యకారులు నిరసన వ్యక్తం చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తీర ప్రాంతంలోని గుమ్మళ్లదిబ్బకు చెందిన మత్స్యకారులు తమ కుటుంబ సభ్యులపై ఉన్న పట్టాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ్మినపట్నంలో ఎన్నో ఏళ్ల క్రితం ఒక కుటుంబానికి ఒక ఎకరా చొప్పున పంపిణీ చేశారని తెలిపారురు. అయితే నేడు ఆ భూములను ఏపీఐఐసీ ద్వారా సేకరించి సర్వే చేస్తున్నారని తెలిపారు. ఇందులో పట్టాలు ఉన్న వారి పేర్లు కాకుండా మరొకరి పేర్లు జాబితాలో నమోదు చేస్తున్నారని ఆరోపించారు. పట్టాలు ఉన్న వారి జాబితాలను పరిశీలించి ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా సర్వే చేపట్టిన బృందాలు ఇంకా సర్వే నివేదికలను అందివ్వలేదని, అవి వచ్చిన వెంటనే సచివాలయాలలో వీలుగా ఉంచుతామని అన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి

బాలాయపల్లి(సైదాపురం): మేత కోసం అడవి వైపు వెళ్లిన రెండు గేదెలు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన బాలాయపల్లి మండలంలోని చిలమనూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు చిలమనూరు గ్రామానికి చెందిన చిల్లకూరు కృష్ణారెడ్డికి సంబంధించిన రెండు మేలుజాతి గేదెలు మేత కోసం గ్రామ సమీపంలోని అడవి వైపు వెళ్లాయి. అయితే అడవి మీదుగా వెళ్తున్న 11కేవీ విద్యుత్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఏర్పాటు చేశారు. దీంతో తన గేదెలు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు బాధితుడు ఆరోపించారు. ఈ గేదెల మృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ మేరకు బాలాయపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

పౌష్టికాహారంపై అవగాహన

రాపూరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా రాపూరు మండలం పంగిలి గ్రామంలో శనివారం పౌష్టికాహారంపై గర్భవతులు, తల్లులకు అవగాహన సదస్సు, సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

జాతర కోలాహలం

– నేడు పోలేరమ్మ తల్లి ఘటోత్సవం


అమ్మవారి దున్నపోతు ఊరేగింపు


భక్తజన సందోహం మధ్య అమ్మవారి ఘటోత్సవం (ఫైల్)

వెంకటగిరి(సైదాపురం): జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వెంకటగిరి ఇలవేల్పు, భక్తుల కొంగు బంగారం, శక్తి స్వరూపిణి శ్రీపోలేరమ్మతల్లి జాతర కోలాహలం నెలకొంది. ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్న పోలేరమ్మతల్లి జాతరలో ప్రధాన ఘట్టమైన ఘటోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఘటోత్సవ వేడుకల్లో భాగస్వామ్యులయ్యేందుకు పట్టణ పరిధిలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఘటోత్సవంలో అమ్మవారికి బలిఇచ్చే దున్నపోతు, ఘటం కుండలతో ప్రతి ఇంటికి తిరుగుతారు. దీంతో వెంకటగిరి పుర వీధుల్లో భక్తులు, యువత కేరింతల మధ్య ఘటోత్సవం కోలాహలంగా సాగుతుంది.

ఇదీ ఘటోత్సవం

పోలేరమ్మ తల్లి జాతరలో అతి ప్రధానమైన ఘట్టం ఘటోత్సవం. ఆ ఘటోత్సవం ఆదివారం నిర్వహించడం ఆనవాయితీ. తొలుత వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో పూజలు జరుపుతారు. మలి పూజ తాటిపత్రి ఇంట జరుగుతుంది. తాటిపత్రి వంశస్తులను వెంకటగిరి రాజాలు ఏమైనా ఆస్తులు, సంపద కావాలని కోరుకోమంటే ఆయన అందుకు బదులుగా వెంకటగిరిలో ప్రతిష్టాత్మంగా జరిగే పోలేరమ్మ తల్లి జాతర ఘటోత్సవం మొదట మీ ఇంటి తరువాత మా ఇంట జరిగేలా చూడాలని కోరారు. అప్పటి నుండి శతాబ్దాల కాలంగా ఘటోత్సవంలో ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. అనంతరం పట్టణంలోని ప్రతి ఇంటి ముంగిటకు ఘటం చేరుకుని ప్రత్యేక పూజలు అందుకుంటుంది. పోలేరమ్మ తల్లి ఘటం ఇంటి ముంగిటకు వచ్చిందంటే సాక్షాత్తూ ఆ పోలేరమ్మ తల్లే ఆ ఇంటికి వచ్చిందని ఆ ఘటం కుండలకు పసుపు, కుంకుమ, వేపాకు తోరణాలతో అమ్మవారికి ఇష్టమైన ప్రసాదాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సమాజాన్ని మేలుకొల్పిన గురజాడ


గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట: ఆరోజుల్లోనే అంటరానితనం, వరకట్నం, బాల్య వివాహాలపై తన రచనలు, నాటికలతో సమాజాన్ని మేలుకొల్పిన మహాకవి గురజాడ అప్పారావు అని సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్వీ శంకరశర్మ అన్నారు. అభ్యుదయ కవితా పితామహుడు, సంఘ సంస్కర్త, తెలుగుభాషకు వెలుగు తెచ్చిన మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతిని శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నవ్యభాషా మార్గదర్శకుడు, మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలపై తన రచనల ద్వారా పోరాటం చేసిన వ్యక్తిగానే కాకుండా తెలుగు జాతి గర్వించేలా భాషకు పట్టం కట్టిన మహాకవి గురజాడ అని విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు డాక్టర్ జె.సుబ్రమణ్యం, డి.ఉషారాణి, బి.శ్రీనివాసులు, డి.నాగభూషణం, ఆర్ శరత్‌బాబు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.రాజా పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

చిల్లకూరు: నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని భారతీయ శిక్షణా మండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తెలుగు ఉపాధ్యాయుడు ప్రజేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గురజాడ అప్పారావు 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సాంఘిక దురాచారాలను రూపు మాపేందుకు విశేషంగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు: మండల కేంద్రమైన వాకాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది గురజాడ అప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాయక్, ఉపాధ్యాయులు యానాదయ్య, అంకయ్య, కిషోర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు


విద్యార్థినులకు వైద్య పరీక్షలు

దక్కిలి: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని దగ్గవోలు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో గర్భవతులకు వైద్య పరీక్షలు చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గర్భవతులు, బాలింతలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆరోగ్యంపై సూచనలు సలహాలు ఇచ్చారు. తరువాత దక్కిలి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం వారిగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. జిల్లా గణాంక అధికారి నాగేంద్ర, టెక్నీషియన్ ప్రకాష్, సూపర్‌వైజర్ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తిరుమల ప్రసాదంపై రాజకీయ కుట్ర


కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ప్రసాదంపై సీఎం చంద్రబాబు రాజకీయ కుట్ర చేయడం తగదని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అట్టర్‌ఫ్లాప్ కావడంతో ప్రజల దృష్టి మళ్లించడం కోసం తిరుమల ప్రసాదానికి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగినట్లు దుర్మార్గపు ఆరోపణలు చేయడం అన్యాయమన్నారు. 2014లో అబద్ధాలు చెప్పి సీఎం కుర్చీని చేజిక్కించుకున్న చంద్రబాబు 2024లో కూడా సూపర్‌సిక్స్ అంటూ ప్రగల్భాలు పలికారన్నారు. ప్రస్తుతం ఒక్కటి కూడా నెరవేర్చకుండా కుట్ర రాజకీయాలు చేస్తుండడాన్ని దేవుడు క్షమించడని తెలిపారు. హిందూ సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా మాజీ చైర్మన్లు భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి టీటీడీకి ఎనలేని సేవలందించారన్నారు. హిందూ ధర్మాన్ని అపహాస్యం చేస్తూ పవిత్రమైన వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో కల్తీ జరిగినట్లు ఆరోపించిన చంద్రబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సూపర్ సిక్స్ వైఫల్యం కప్పిపుచ్చేందుకు కల్తీ నాటకం

పెళ్లకూరు: సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మార్చడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు తిరుమల ప్రసాదంపై కల్తీ నాటకాలు ఆడుతున్నారని ఎస్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పుల్లూరులోని ఆయన నివాసంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎక్కడ చూసినా కూటమి నేతల దౌర్జన్యం, అరాచకాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. 18 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా జాతర

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తిస్వరూపిణి శ్రీపోలేరమ్మతల్లి జాతరను భక్తుల మనోభావాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర పండుగ హోదాలో నిర్వహించబోతున్న వెంకటగిరి జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1 కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఘటోత్సవం నుండి జాతర ప్రారంభమవుతుందన్నారు. 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు రోజుకొక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనానికి రూ.300, రూ.100, ఉచిత దర్శనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చంటిబిడ్డతో ఉన్న తల్లిబిడ్డకు వీఐపీ క్యూలైన్ ద్వారా దర్శన భాగ్యం కల్పించనున్నారు.

వెంకటగిరి సీఐ ఏవీ రమణ మాట్లాడుతూ గతంకంటే మరో 100 మంది పోలీసులను అదనంగా నియమించినట్లు తెలిపారు. 25, 26వ తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, టీడీపీ నేత గంగోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. వెంకటగిరి జాతర శాంతి కమిటీ సమావేశానికి ప్రజాదరణ కరువైంది. సాయంత్రం 4 గంటలు నిర్వహించాల్సిన సమావేశం 5.45 గంటలకు ప్రారంభం కావడం, అప్పటికీ పట్టణ ప్రజలు పెద్దగా హాజరు కాకపోవడంతో కుర్చీలు సైతం ఖాళీగా దర్శనమిచ్చాయి.

గురుకులానికి స్వర్ణముఖి నీరు


స్వర్ణముఖి నదిలో కొత్తగా వేసిన బోరు వద్ద ప్రిన్సిపల్ దాదాపీర్ తదితరులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులానికి కిలోమీటరు దూరంలో ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఎట్టకేలకు తాగునీరు సరఫరాను శనివారం పునరుద్ధరించారు. ఆరేళ్లుగా నిలిచిపోయిన తాగునీటిని సరఫరాను ప్రిన్సిపల్, దాతల చొరవతో పునరుద్ధరించడంపై విద్యార్థులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్ల కిందట తుపాన్ కారణంగా విద్యుత్ మోటార్ కొట్టుకుపోయి పైపులైన్ సైతం దెబ్బతిన్నాయి. ఈ ఆరేళ్లుగా గురుకులంలోని సెప్టిక్‌ట్యాంక్ వద్ద వేసిన బోరు నుంచి తాగునీటి సరఫరా చేసేవారు. అయితే ఉన్నతాధికారుల సూచనల మేరకు సెప్టిక్ ట్యాంక్ వద్ద వేసిన బోరు నుంచి తాగునీరు సరఫరాను నిలిపి వేసి మినరల్ వాటర్ ట్యాంకర్లతో తాగునీరు తెప్పించేవారు. దీనిపై ప్రిన్సిపల్ దాదాపీర్‌తో పాటు గురుకులాల తిరుపతి జిల్లా అధికారి టి.పద్మజ ప్రత్యేక దృష్టి సారించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తదితరుల దాతృత్వంతో రూ.1 లక్ష వరకు ఖర్చు పెట్టి స్వర్ణముఖి నదిలో కొత్తగా మోటారు పెట్టించారు. తాగునీటి పైపులైన్‌లను మరమ్మతు చేశారు. గురుకులానికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టారు.